# బాలసాహితి

## రహీంఖాన్ రాజభక్తి

వి. రఘునాథరెడ్డి

వెన్నెల్లో విజయనగరం తళతళలాడిపోతోంది. తుంగభద్రా తరంగాల్లో విజయనగరం కోట గోడలు ప్రతిఫలిస్తున్నాయి. వెన్నెల, విరూపాక్షస్వామి గుడి గోపురం కనకకలశంపైన పడుతోంది. బంగారుకు మెరుగుబెట్టిన రీతి, ఆ గోపురం ద్విగుణీకృతమైన కాంతితో ప్రకాశిస్తోంది.

అది విపణివీధి. విజయనగర శోభనమంతా ఆ వీధి నిర్మాణంలోనే నున్నదేమో ననిపిస్తోంది.

ఒకప్రక్క రత్నాలు రాసులు రాసులుగా పోసుకొని అమ్ముతున్నారు. వారికి చోరభయమన్నది ఏకోశానా లేదు. మరొకప్రక్క ఘుమఘుమ వాసనలను వెల్లగక్కుతూన్న పుష్పగుచ్ఛాలను అమ్ముతున్నారు. పురుషులు యిండ్లకు వెళ్తూ భార్యలకోసం పువ్వులు కొనుక్కుంటున్నారు. పువ్వులమ్ముతూన్న వాళ్ళలో రహీంఖానొకడు.

రహీంఖానుది పొరుగూరు. మంచి యౌవనంలో వున్నాడు. వివాహమై చాలా రోజులు కాలేదు. ఎప్పుడూ కోపం అతని ముక్కుపైనే తాండవమాడుతూంటుంది. అతనిది పువ్వుల వ్యాపారం. ఆ రోజు పెందలకడే యిల్లు చేరుకోవాలనుకున్నాడు. అందుకు, పువ్వులు సలీసు వెలకు అమ్మడం కంటే అతనికి వేరే మార్గం కనిపించలేదు.

ఇంతలో ఆకాశమంతా మబ్బులు క్రమ్ముతున్నాయి. గుండెలు స్థిరైపోయేలా ఉరుము లురిమాయి. కనులు కన్పించకపోయేలా మెరుపులు మెరిశాయి. కుంభవర్షం! నీ కూటికుండలో దూకుదునో, నీ రత్నాల రాశిపై క్రుమ్మరింతునో, నీ పువ్వు లంగడిపై పడుదునో అని క్షణక్షణానికి భయపెట్ట సాగింది వర్షం! అందరూ అంగళ్ళు సర్దుకోబోయారు. ఇంతలో కుంభవర్షం రానేవచ్చింది.

రహీంఖానుకు వర్షంలో తలదాచుకోడానికి, సత్రం కంటే సురక్షితమైన స్థలం ఏదీ కన్పించలేదు. విజయనగర రాజుల కాలంలో సత్రాలుగూడా సామంత రాజుల నగరులలాగుండేవి. అక్కడ, మజ్జన భోజనాదులు చేసుకోడానికి సకల సదుపాయాలూ వుండేవి. ఆ సత్రాల్లో విశ్రమింపవచ్చినవారిలో షాహుకారు, పేద అన్న తారతమ్యమే లేదు. రోగులు గూడా అందు తలదాచుకోవచ్చు.

సత్రంలో రహీంఖానుకు ఒక క్షయరోగి తటస్థపడ్డాడు. ఆ రోగి దగ్గుతో అవస్థపడుతున్నాడు. వారిద్దరు తప్పితే సత్రంలో, ఆ రాత్రి మరెవ్వరూ లేరు. అతనికి ఆ సత్రమే భూలోకస్వర్గంలా కన్పించింది. తన స్వంతయిల్లేమో ఒక పూరిపాక. ఇంటికన్న గుడి పదిలమన్న సామెత ముమ్మాటికి నిజమనిపించింది రహీంఖానుకు.

రహీం ఆ రాత్రి సత్రంలో వెచ్చగా నిద్రపోవాలనుకున్నాడు. అతడు హాయిగా నిద్రపోయి చాలా రోజులైంది. జాము రాత్రికి పైగా యింటికి చేరుకోడం, మళ్లీ ఉదయమే లేచి విపణివీధికి పోవడం అతని దినచర్య అయిపోయింది. కాళ్లు అరిగిపొయ్యేలా తిరిగి తిరిగి అతని శరీరం మొండిబారిపోయింది. అతడిప్పుడు మార్దవ్యమన్నదే ఎరగడు. లాలిత్యమన్న పదం అతని చెవికే జొరబడదు.

రోగి దగ్గు రహీంకు నిద్రాభంగం కల్గించింది. దాన్నతడు ఏమాత్రమూ సహించలేకపోయాడు. జీవితంలో, ప్రపంచకష్టా

లను మరచి, హాయిగా ఒక రాత్రైనా స్వర్గసౌఖ్య మనుభవిద్దా మంటే, అదృష్టం లేకుండా పోయిం దనుకున్నాడు. తన సహజమైన కోపానికి రోగి దగ్గు, అగ్నికి వాయువు తోడ్పడినట్టయ్యింది. ఆ రోగి, తన సౌఖ్యప్రదమైన ఉద్యా నవనాన్ని కూకటివేళ్ళతో పెళ్ల గించేస్తున్నాడని నిశ్చయించుకు న్నాడు. క్షణక్షణానికి ద్విగుణీకృత మౌతూన్న కోపాన్ని అణచుకో లేకపోయాడు. ఈసారి దగ్గావంటే పొడిచేస్తానని రోగిని బెదరించాడు. కానీ, ఆ రోగి దగ్గును ఆపుకో లేక పోయాడు. ఒకటి, రెండు, మూడు సార్లు ఓర్చుకున్నాడు. అంతే. ఒక దెబ్బతో ఆ రోగిని పరలోకానికి పంపాడు.

చనిపోయేటప్పుడు రోగి కెవ్వున కేక బెట్టాడు. ఆ కేకను విన్న పహారా జవానొకడు అక్కడికి పరు గెత్తుకొచ్చాడు. ఒక పీనుగ, ప్రక్కన ఒక ముసల్మాను నిలబడిఉండటం జవాను చూచాడు. అతని కేమీ అర్థం కాలేదు. తన కసి తీరెనా అన్నట్టుగా ముసల్మాను యువకుడు తన కుడిచేతిని తనే చూచి మెచ్చు కుంటున్నాడు.

ఆలస్యం చేయకుండా, జవాను రహీంను ఖైదుజేశాడు. అప్పటి వరకు, రహీంకు అతని పరిస్థితి ఏమీ గోచరం కాలేదు. స్మృతి కొచ్చాక జవానును చూచి భయ పడ్డాడు. సంజాయిషీ చెప్పుకో జూచాడు. కానీ లాభం లేక పోయింది.

అది కృష్ణదేవరాయల నిండు పేరోలగం. ఒక ప్రక్క తిమ్మరుసు దీర్ఘాలోచనా నిమగ్నుడై కూర్చొని

# పొడుంకాయ

## రెంటాల గోపాలకృష్ణ

విప్పర్ల అనే గ్రామంలో
వీధిబడి ఒకటుంది!
బడిపంతులు ప్రవర్తన
బహు విచిత్ర మైనది!

పొంకమైన పొడుముకాయ
బొడ్డు కొంగునే పెట్టును!
బింకముగా పలుమారులు
పట్టి పట్టి పీల్చు పొడుము!

బడిలో ఒకనాడాతడు
పాఠం చెబుతున్నాడు!
పిల్లలందరు వినగా
పెద్దగ ఇట్లన్నాడు!

"పరీక్ష పంతులొస్తాడని
వర్తమాన మొచ్చింది!
సరిగ జవాబు లివ్వకపోతే
బహు ప్రమాదం వస్తుంది!

భూమి ఎలా వుంటుందని
ఎవరినైన ప్రశ్నిస్తే,
బెదిరిపోక వెనువెంటనె
నావైపే చూడండి!

అపుడు మీకు నాదగ్గర
పొడుముకాయ చూపిస్తా!
గుండ్రముగా ఉంటుందని
మీకు గుర్తు కలిగిస్తా!"

అతి తెలివిగ ఆపంతులు
ఆలోచనయితే చేశాడు!
ముఖ్యమైన ఒక విషయం మాత్రం
బొత్తిగ మరిచే పోయాడు!

అందమైన పొడుంకాయలు రెండు
అతనిదగ్గరే ఉన్నాయి!
గుండ్రంగా ఉండే దొకటీ!
చదరంగా ఉండే దొకటీ!

వారము పొడుగున పలకకాయనే
పట్టుకురావడ మలవాటు!
ప్రతీ ఆదివారం మాత్రం
మరి గుండ్రటి కాయే తెస్తాడు!

మరునటి రోజున బళ్ళోకి
పరీక్ష పంతులు వచ్చాడు!
'భూమి ఎలా ఉంటుంద'ని
ఒక బుడుతను ప్రశ్నించాడు!

సంతోషముతో పిల్లవాడు తన
పంతులువైపే చూచాడు!
పొడుముకాయలను గుర్తుతెచ్చుకొని
పొలుపుగ జవాబు చెప్పాడు!

"ప్రతీ ఆదివారంనాడు భూమి
గుండ్రంగానే ఉంటుంది!
తక్కిన రోజులలో మాత్రం అది
నలు చదరంగా ఉంటుంది!"

అది విని బడిపంతులు లోలోపల
గడ గడ గడ గడ వణికాడు!
పరీక్ష పంతులు మాత్రం పైకే
పకా పకా పక నవ్వాడు!

# ★ రహీంఖాన్ రాజభక్తి ★

ఉన్నాడు. కవులందరు, తమ తమ సహజశోభలతో సభకు వన్నె గూరుస్తున్నారు. సామంతులు, సైన్యాధిపతులు మరొక ప్రక్క తమ శౌర్యాన్ని, ధైర్యాన్ని వెలిగ్రక్కుతూన్న ముఖబింబాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు. చూపరులకదొక మయసభలా కనులకు మిరుమిట్లు గొల్పుతోంది. ఆ సభా స్తంభాలలో తమ తమ ప్రతిబింబాలు అద్దంలో మాదిరి స్పష్టంగా వెలిగిపోతున్నాయి.

రాయలు దుష్టశిక్షకుడు. శిష్టరక్షకుడు. అతని పరిపాలనలో న్యాయం నాలుగు కాళ్లపైనా సమంగా నడిచింది. దుర్మార్గులకు నిర్దయతో కఠినశిక్ష విధింపబడుతూ ఉండేది. ఒకవ్యక్తిని అన్యాయంగా చంపినవానికి, విచారణా రహితంగా ఉరిశిక్ష విధింపబడుతూ ఉండేది. అటువంటి సమయాల్లో రాయలు కర్కశత్వాన్ని వహించును. మార్దవమును మరచిపోవును.

నిండు పేరోలగంలో, ఖైదీగా బంధింపబడిన రహీంఖాను ప్రవేశపెట్టబడ్డాడు. పహరాజవాను, రహీం చేసిన హత్యా విషయాన్ని సమగ్రంగా వివరించాడు. రాయల కోపానికి అంతులేకపోయింది. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. ముఖం రక్తంలా మారిపోయింది. అప్పాజీతో సంప్రదించకనే, హత్యా నేరానికి హత్యే శిక్షని, రహీంకు ఉరిశిక్ష విధించాడు.

రాయలు చిన్నప్పట్నుంచి తిమ్మరుసును 'అప్పాజీ' అని ఆప్యాయంగా పిల్చేవాడు. తిమ్మరుసు ఆవలించిన ప్రేవులు లెక్కపెట్టగల ధీశాలి. అతని ధీగరిమ సామాన్యుల కందుబాటులో లేనిది. అతడు రాయల ఔన్నత్యానికి, ప్రజాదరణకు రాజ్యవిస్తరణకు ముఖ్య కారకుడు. అతని ఆజ్ఞను రాయలు శిరసావహించేవాడు.

తిమ్మరుసు రహీంఖానుకు ఉరిశిక్ష విధించగూడదని ఆజ్ఞాపించాడు. అంతేగాదు. ఖైదునుండి అతనిని విడిపించడమే గాక, షడ్రసోపేతమైన భోజనాలతో అతనిని ఆదరించమన్నాడు. సభ దిగ్భ్రాంతి చెందింది. రాయలు నివ్వెరపోయాడు. అతనికేమీ పాలుపోలేదు. సభికులొకరి ముఖాల్నొకరు ఆశ్చర్యంతో చూచుకోజొచ్చారు. అయినా, అప్పాజీ యుక్తి అందరెరిగినదే కావడంవల్ల, రాయలు గూడా మౌనం వహించాడు.

మూడేండ్లు రహీం జీవితం హాయిగా గడిచిపోయింది. ఇప్పుడతనిలో యెక్కడలేని సౌకుమార్యము, దయ వుద్భవించాయి. అతనికి రాయలు దైవంగా కనపడ్డాడు. అప్పాజీ, ఎండలో మోడువోయిన తన జీవిత వృక్షానికి అమృతము పోసి, ఫలభరితం, సౌఖ్యభరితం గావించిన వాడిలా కన్పించాడు. ఇప్పుడతని శరీరం రాయల కంకితమైపోయింది. రాయల సౌఖ్యానికి



తన జీవితాన్ని ఎప్పుడైనా అర్పించడానికి సంసిద్ధంగా ఉన్నాడు.

క్రీ. శ. 1520 ప్రాంతంలో, రాయచూరుదుర్గం, బిజాపూర్ సుల్తాన్ అధీనమందున్నది. అది కృష్ణ తుంగభద్ర నదుల నడుమ నెలకొనియున్న బలిష్ఠమగు కోట. ఆ సుల్తానుకు విజయనగర రాజులన్న మాత్సర్య మెక్కువ. అదనుజూచి, వారిని పడగొట్టాలన్న ఉద్దేశం సుల్తాను మెదడులో ఎప్పుడూ మెదులుతూనే వుంది. అదనుజూచి, సుల్తాను విజయనగరంపై యుద్ధం ప్రకటించాడు.

అప్పుడు విజయనగరం యుద్ధానికి సంసిద్ధంగా లేదు. ఏం చేయాలో గూడా రాయలకు స్ఫురించ లేదు. అప్పాజీతో సంప్రదించి, సంధి జేసుకోడమే ఉత్తమ మనుకున్నాడు రాయలు. అప్పాజీ గూడా దీర్ఘంగా ఆలోచించి, సంధే శ్రేయోదాయక మన్న నిర్ణయానికి వచ్చాడు. అప్పుడే సంధిలేఖ వ్రాయబడింది. తిమ్మరుసు, తన చతుర్విధోపాయాల నుపయోగించి, యోచించి ఆ లేఖను రహీం చేతికిచ్చి పంపాడు.

ప్రభువు తనపై చూపిన ఆదరణకు ప్రతిఫలం చూపవలసినసమయ మాసన్నమైనది రహీముకు. సంధిలేఖ తీసికొనిపోవడానికతని కుత్సాహం మెండయ్యింది. రాజ శ్రేయస్సుకోసం, తన జీవితాన్నైనా అర్పించడానికి సంసిద్ధంగా నున్నాడు రహీంఖాన్.

అది గాఢ నిశీథం. సుల్తాను తనకు నమ్మకమైనవారితో యుద్ధ విషయాలను గురించి మంతనాలు సలుపుతున్నాడు. ఆ సమయంలో, రహీం సంధిపత్రంతో నవాబును





ఓవల్‌టిన్

ఆమె తిరిగి ఆరోగ్యం పొందటానికి తోడ్పడుతున్నది

జ్వరం తగిలినమీదట కలిగే బలహీనము. మందగొడితనము నుండి ఆమె త్వరగా కోలుకొంటున్నది డాక్టరు ఆమెకు 'ఓవల్‌టిన్' యిస్తున్నారు ఇప్పుడు ఆమెకు తిరిగి శీఘ్రంగా బలం ఎక్కుతున్నది. పుష్టికరమైన 'ఓవల్‌టిన్' ఆమె స్వస్థతకు కారణము

'ఓవల్‌టిన్' ప్రకృతి సిద్ధమైన ఉత్తమ ఆహారములనుండి తయారు చేయబడినది ఆదికా౹ అందులో బి డి విటమినులు గూడ చేరివున్నవి అది రుచిగా వుండడంవల్లను, దుర్బలులకు గూడ సులభంగా జీర్ణంకావడంవల్లను, జబ్బు పడిలేచినవారికి ప్రత్యేకంగా తగినది అందువల్లనే 'ఓవల్‌టిన్' ఆస్పత్రులలోను, నర్సింగుహోములలోను వాడబడి, ప్రపంచ మంతటా డాక్టర్లచే శిఫారసు చేయబడుతున్నది

'ఓవల్‌టిన్' మాత్రమే ఉపయోగించండి దానికి బదులు యితర వాటిని వాడవద్దు




జబ్బు పడిలేచిన తరువాత బలం చేకూరడానికి

ఓవల్‌టిన్

డిస్ట్రిబ్యూటర్లు గ్రాహమ్సు ట్రేడింగ కంపెనీ
(ఇండియా) లిమిటెడ్

సిలోన్ రేడియోమీద శనివారాలు రా 8 నుండి 8-30 గం.ల వరకు ఓవల్‌టిన్ ఎమెచూర్ కార్యక్రమం వినండి
(హిందీ—41 72 మీటర్లు)

OV. 442

# ★ రహీంఖాన్ రాజభక్తి ★

ముఖాముఖిని సందర్శించాడు. సుల్తాను సంధిపత్రాన్ని చూస్తూనే ఆగ్రహోదగ్రుడై రాయల పిరికితనాన్ని తూలనాడుతూ, లేఖను చింపి నేలపైన విసిరిపారేశాడు. రాయలు అంత పిరికివాడని సుల్తాను కలలో గూడా అనుకోలేదు. సంధిని అధిక్షేపించడమే గాకుండా, రాయలను దూషించాడు గూడా! రాయల స్వరూపాన్ని దైవంకన్న మిన్నగా భావించి పూజిస్తున్న రహీం ఆ మాటలను సహించలేక సుల్తానును తన నిశితకరవాలానికి ఎరగావించాడు. అంతటితో కోపమాగక తన కరవాలంతో అక్కడున్నవారిపై ఒక్క ఝుళుపు ఝుళిపించాడు.

ఆ ఝుళుపుతో అక్కడున్న వారిని భయపిశాచ మావరించింది. ఒక్క క్షణమాత్రంలో ఆ విషయం సైన్యమంతటా పాక్కిపోయింది. నవాబుతో శత్రుసైన్య మెదుర్కొని, అతనిని యమపురి కంపినదన్న విషయం వాళ్ళకు రూఢైపోయింది. సారాయిమత్తులో పడి పొర్లుతున్న తురుష్క సైనికులు,



కాశ్మీరు శాలువ
రు. 2-8-0 మాత్రమే
96'' × 54'', కొంతగల కాశ్మీరు శాలువ రు 2-8-0 లకు వస్తోంది. పోస్టేజీ అదనం. స్టాకు పరిమితంగా ఉంది. విలాసం ఇంగ్లీషులో వ్రాయండి:
KASHMIRI SHAWL HOUSE,
Durgiana (A. P. W.) Amritsar.


ఆ రాత్రి గాఢమైన మబ్బులో నిద్ర నుండి మేల్కొన్నవారు మేల్కొన్నట్లుగానే ఒకరొకరు నరుక్కోజొచ్చారు. కొంతసేపటిలో వాళ్ళ సైన్యం చాలావరకు నాశనమైపోయింది. ఇక శత్రువుల నెదుర్కోలేమన్న నిర్ణయంతో తురుష్క సైనికులు ఎవరికివారు, చెట్టుకొకడు పుట్టకొకడుగా పారిపోయారు. వాళ్ల చావుకు, ఓటమికి వాళ్ళే కారకులయ్యారు.

నవాబును నరుకుతూనే రహీంఖాను, ఆ మందిరంలోని దీపాలను ఆర్పేశాడు. తన కత్తిని 'ఛళ్'మని ఒక్క ఝుళుపు ఝుళిపించాడు. అంతటితో అక్కడున్న మంత్రులు సైన్యాధిపతులు పారిపోయారు. ఇంక రహీం అక్కడుండడం తన ప్రాణానికే ముప్పని గ్రహించి, రహస్యంగా బయటబడి, దూరం నుండి యవనసైనికులు ఒకరినొకరు చంపుకోడం చూచి పొట్ట పగిలేటట్టు నవ్వుకున్నాడు. అతనికి మతంతోగాని, వంశంతోగాని, కులంతోగాని పనిలేదు. రాజభక్తి అన్నదే అతనికి అన్నిటికన్న మిన్న!

మరునాడు, రాయలు నిండు పేరోలగంలో ఆసీనుడై యున్నాడు. అందరు దీర్ఘంగా, యుద్ధవిషయం ఆలోచిస్తున్నారు. ఎవ్వరి నోటి నుండీ మాట పెగల్లేదు. తిమ్మరుసు మాత్రం తన సహజమైన ఉత్సాహాన్ని వీడలేదు. అతని ముఖం యథాప్రకారంగా కలకలలాడుతోంది. ఇంతలో రహీంఖాన్ సభలో ప్రవేశించాడు. అందరు అతనిపైపే కనురెప్ప వెయ్యకుండా చూస్తున్నారు. రాయలు, ఆత్రంతో రహీంను ఏదో అడగబోయాడు గాని, పైకి ఏమీ పలుకలేకపోయాడు.

తిమ్మరుసు రహీంతో సావధానంగా చర్చించాడు. జరిగిన విషయాన్ని ఆమూలాగ్రం గ్రహించాడు. అప్పట్లో సభలోని సంతోషము, ఉత్సాహము వర్ణింప నలవికానివి. అందరు రహీంఖాను రాజభక్తి ఎనలేనిదని కొనియాడారు. రాయలు స్వయంగా, తన కంఠాన్నలంకరించియున్న రత్నాలహారాన్ని తీసి రహీం మెడలో వేశాడు. అంతేగాదు, అతనిని ఒక దళానికి సైన్యాధిపతిగా గూడా నియమించాడు.

రాయల పరిపాలనలో మతభేదాలు, కులభేదాలు ఏమాత్రమూ పాటించబడలేదు. శౌర్య ధైర్యాలున్నచో ఎవరైనా గొప్ప పదవుల నందవచ్చును.

రహీంఖాను రాజభక్తి అమోఘమైనది. క్రౌర్యమునకు నెలవుగనున్న అతనిమనస్సు, రాజాదరణచే మృదువైంది. తన కప్పజెప్పిన కర్తవ్యాన్ని బహుయుక్తితో, ధైర్యంతో నెరవేర్చాడు. రాజభక్తిపరుడు గావుననే, పెద్ద పదవి నందగల్గాడు. ★


వైటోడెంట్
దంతక్రిములను సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్, మద్రాసు-30.